(ఆంధ్రజ్యోతి వీక్లీ, దీపావళి 1988)

మూనారు గాంధీ

రాత్రంతా రిహార్సల్ చేసుకున్నాను. నాన్నగారితో చెప్పేద్దామని. కాని నా నాలుక నా మెదడిచ్చే ఆజ్ఞల్ని పాటించడంలేదు. "టిఫిన్ తిందాం రారా చిన్నా "అని నాన్నగారు స్వయంగావచ్చి పిలుచుకువెళ్ళేరు. మేడమీద గది కిటికీలోంచి నరసయ్యగారి పెరట్లోకి చూస్తూ దొరికిపోయాను. నోట్లో టూత్ బ్రష్ ఆడుతోంది గానీ, అ పని వాష్‌బేసిన్ దగ్గిర కదా చెయ్యాలి: "స్నానం చేసొస్తావా?—నేను పొలంమీదికి వెళ్ళాలి—నీకోసం కూర్చోలేనేమో" అంటూ మెట్లు దిగిపోతున్న నాన్నగారితో "స్నానం తరవాతెప్పుడో చేస్తాను, నాన్న గారూ" అని హడావిడిగా చెప్పేసి వాష్‌బేసిన్ దగ్గిర చేరి మొహం కడుక్కొని చకచకా కిందికి దిగొచ్చాను.

వంట మనిషి నాకూ ఆయనకీ టిఫిన్ వడ్డించింది.

మా ఇద్దరి అలవాట్లలో కూడా చాలా తేడా, నాకు ప్రతిరోజు ఇడ్లీలు పెస రట్లు కావాలి. ఆయనకి రెండంటే రెండు చుక్కారొట్టెలు. చాలు "పొలంమీద పని చేస్తారు నాన్నారూ మరి కొంచెం పోషకాహారం తినాలి" అని నేను వైద్య విద్యార్థిగా ఆయనకి ఓసారెప్పుడో సలహా ఇచ్చాను. ఆరోజు ఆయన ఇచ్చిన వివరణ నాకింకే గుర్తే. "నేను రెండు పుల్కాలు తినడమే చూసేవుగాని దాంతో ఆరగించే పప్పు సంగతి చూడలేదు నువ్వు" అంతే. మిగిలినది ఆయన చెప్పరు: అక్కర్లేదు కూడాను. యాభై గ్రాముల పెసరపప్పు, ఒక పూర్తి వెల్లుల్లిగడ్డతో కొంచెం అల్లం, జీలకర్రా వేసి ఉడకపెట్టాలి. చిన్న మిరపకాయ ఒక్కటి రెండు చెమ్చాల ఆవునేతితో వేయించి తిరగమోత వెయ్యాలి. ఈ రెండు పుల్కాలతో ఆ పప్పు అంతా ఒక్క బొట్టు మిగలకండా తినేస్తారు.

"నువ్వు తినే రెండు పెసరట్ల కన్నా ఇదే ఎక్కువ!" అని ఆయన చెప్పక్కర్లేదు కదా.

చెప్పదల్చుకున్నమాట నా నోటమ్మట రాడంలేదు. ఆయన టిఫిన్ తినడం అయిపోయింది. వంటావిడ పాలగ్లాసు పెట్టేసి వెళ్ళిపోయింది. మజ్జిగ

లాగ గటగటా తాగేసి లేచి వెళ్ళిపోతారు, ఇప్పుడు చెప్పెయ్యాలి, లేకపోతే మళ్ళా రేపు ఉదయంవరకు ఆయన నాకు దొరకరు. పొలం వెళ్ళి ఆయన వచ్చే సరికి ఊరిజనం అంతా సావిటిలో ఆయన కబుర్లకోసం చేరుతారు, నాలుగు గంటలకి సభ తీరిపోగానే స్నానం చేసి పుస్తకాల గదిలోకి వెళ్ళిపోతారు.ఆరు గంటలకి పంచాయతీ ఆఫీసుకి వెళ్లి ఎనిమిదిగంటల కొస్తారు, రాత్రి తినే రెండు పుల్కాలు ఆయన గదిలోనే తింటారు తప్పా వంటింటి గదిలోకి రారు. వంటమనిషి నాతో ఆ కబురూ ఈ కబురూ చెప్పి కొసిరి వొడ్డించి పనులన్నీ పూర్తి చేసుకుని వెళ్ళిపోతే తలుపులు నేనే వెయ్యాలి,

"గాంధీగారు గొప్పవారే కావచ్చుగాని గాంధేయవాదానికి రోజులుకావు నాన్నగారూ!" అన్నాను. టైమ్ అయిపోతూ వుంటే ఆఖరి ప్రశ్నకి సమాధానం రాసేసినంత హడావుడిగా, పేపరు లాగేసుకుంటారేమో అన్న భయంలో రాసేసి నట్టు దొంగతనంగా.

పాలగ్లాసు ఖాళీచేసి కిందపెట్టేరు నాన్నగారు. నేను ఆయన వేపు చూడ లేదుగాని ఆయన నావేపు చూసేరు, ఎదుగుతున్న పిల్ల పక్షికి రెక్కలొచ్చి ఎగ రడం ప్రాక్టీస్ చేస్తూ వుంటే తల్లి పక్షి చూసినప్పటి వినోదం కళ్ళలోకి తెచ్చు కుని చూసి వుంటాడు.

"గాంధేయవాదానికి కాని రోజులంటూ వుండవు చిన్నా."

* * *

"నాన్నగారితో వాదన పెట్టుకొని గెలవలేరు చినబాబూ" అని సన్నాయి నొక్కులు నొక్కుతూ చెప్పి వెండిగ్లాసుతో తెచ్చిన కాఫీ చేతికందించింది మీనాక్షి.

"నిన్నెవరూ చెప్పమన్లేదు" అంటూ ఆ చేతివేళ్ళు తగలకుండా జాగ్రత్త పడుతూ గ్లాసు అందుకున్నాను.

"ఆయన చెప్పమన్నారని మీరు మొదలెట్టారా; మీరు చెప్పమన్నారని నేను చెప్పేనా? మంచి అనిపించింది మరో మనిషికి చెబుదామని ఎవరికేనా అనిపిస్తుంది" అని రెండు ప్లేట్లు, మూడు గ్లాసులు, పప్పు వుంచిన మట్టుగిన్నె, చెమ్చా-అన్నీ పట్టుకుని వెళ్ళిపోయింది మీనాక్షి.

"వెంకట్రావూ!" అని వీధిలోంచి కేక.

"అదుగో వొచ్చేడు బుచ్చిబాబు!వాడి కాఫీ కిటికీలో ఉంది పట్టుకెళ్ళండి

నాకు పనుంది" అంది మీనాక్షి. సింకు దగ్గిర పీటమీద కూర్చున్న మనిషి కదల కుండు, తల మాత్రం ఇటు తిప్పి.

నవ్వవలసివ సమయం కానప్పుడు కూడా నవ్వుతుందని నాకు మీనాక్షి అంటే కోపం. విసురుగా రెండో గ్లాసు రెండో చేత్తో పుచ్చుకుని "వస్తున్నా" అని కేకపెట్టి వీధి వసారావేపు బయలుదేరాను.

అసలు వీడివల్ల వొచ్చింది ఈ రంధి అంతాను.

*　　　*　　　0

మానూరు నుంచి కోనూరుకి రెండుమైళ్ళు.

ఆరోక్లాసు చదివినన్నాళ్ళు నడిచేవెళ్లేను.

నేను ఏడులోకి వచ్చేసరికి నారాయణ ఐదు పాసయ్యేడు.

"వాణ్ణి కోనూరు పంపించు" అన్నారు నాన్నగారు.

"ఆడు కోనూరు సదువుకి పోతె గేదెల్నెవడు కడుగుతాడు బాబయ్యా? ఇప్పుడిప్పుడే ఒంటికి జనపత్తా వుంది. పని నేర్పిత్తే నాకు సాయంగా వుంటాడు" అన్నాడు వెంకడు.

"పని నీకు అలవి కాకపోతే మరొకణ్ని పెడతాను. వాణ్ణి చదవనీ. నిన్ననే హెడ్మేస్టరు నాతో చెప్పేడు నారాయణకి చదువొస్తుందండీ వాణ్ని చదవ నిస్తే బావుండునూ అని."

నాన్నగారు సైకిలు నాకోసమే కొన్నారు. కాని రోజూ రెండు పూటలా పోనూ రానూ నారాయణే తొక్కేడు, మొదటిలో ముందుని రాడ్డుమీద కూచునే వాడిని. ఓ రోజు తొడలు తిమ్మిరెక్కి అరగంటసేపు బాధపడితే కమసాలి ఎల్లయ్య ఆ సైకిలుకి వెనకచక్రంమీద ఒక ఇనపస్టాండు అమర్చి, దానిమీద ఒక చెక్కపీట దిగ్గొట్టి. అందిమీద' నేను హాయిగా కూచుంటే ఆనందించి మా వెనకాతలే కోనూరు వొచ్చి. చెక్కపీటమీద కొబ్బరిపీచుతో చేసిన దిండు వేయించేడు మాదేకుల ముసలయ్యచేత సైకిలు ముందు రాడ్డుమీద నన్ను కూచో పెట్టి నారాయణ నన్ను డబల్సు తొక్కుకొచ్చిన మొదటిరోజు మా అమ్మ- "ఆ బట్టలక్కడ విప్పి స్నానంచేసి లోపలికిరా" అని వీధి వసారాలో బాల్చీడు నీళ్ళు పెట్టించింది. నాన్నగారు ముక్కుమీద వేలుపెట్టుకుని వెంటనే తీసేసి అడ్డంగా ఆడించేరు. "అయ్యో, నేనందుకు అనలేదండీ. నారాయణకేమి, మన పిల్లాడి లాంటివాడు. స్కూల్లో ఇంకా ఎంతమంది ఉంటారో; మయిలవాళ్ళ

కూడా వుండొచ్చు కదా" అంది అమ్మ సౌమ్యంగా. "పగలంతా చెమట పడు తుంది కదా అని!"

"రోజూ బడినుంచి రాగానే ఆ గుడ్డలు వేరే పెట్టి స్నానం చెయ్యడం మంచిదే అనుకో" అన్నారు నాన్నగారు. అలా రెండోపూట స్నానం అలవాట యింది.

0 0 0

నా చేతిలో రెండోగ్లాసు చూడగానే పెణకలోంచి గాజుగ్లాసు తీసాడు నారాయణ, "పొయ్యి" అన్నట్టు చెయ్యి జాపేడు.

"ఎవరూ లేర్లే. దీంతో తాగి" పరవాలేదు అన్నాను.

నారాయణ నవ్వేడు. "పంతులమ్మగారు నీది కడిగిన చేతితో నాది కడుగు తాదా?" అన్నాడు.

"నోర్మయ్యి" అన్నాను నవ్వుతూ, వాడి గ్లాసులో కాఫీ పోస్తూ,

నేను ఎనిమిదో క్లాసులో వుండగా మా అమ్మ చచ్చిపోడం, మా అక్కకి పెళ్ళి అవడం, నేను సగం పరధ్యానంగా, సగం పిచ్చిగా, సగం అశ్రద్ధగా వుండడం—ఈ కారణాలవల్ల అటు ఎటెండెన్సూ ఇటు మార్కులూ రెండూ చాల్లేదు. నేనూ నారాయణా క్లాస్మేట్లయిపోయాం. అయితే అందువల్ల నాకు మేలే జరిగింది.

నారాయణ ఎప్పుడూ క్లాస్ ఫస్ట్. తొమ్మిదో క్లాసు నుంచి మా హైస్కూల్లో మూడు సెక్షన్లుండేవి. అపడు స్కూల్ ఫస్టు వాడే. పది, పదకొండు,పన్నెండు—ఈ మూడు క్లాసుల్లోనూ నేను కొంచెం వెనుకబడుతున్నానని రోజూ నారాయణ రాత్రి పూట అన్నం తినగానే వొచ్చేసేవాడు. ఆ రోజు అన్న పిరియడ్లలో అయిన పాఠాలు అన్నీ ఖచ్చితంగా నాకు వంటబట్టేయని రూఢి అయ్యేదాకాను, నేను నిద్దట్లోకి జారుకుంటున్నా నన్ను లేపి కూర్చోపెట్టి- ఆ పాఠాలన్నీ తను చదువుకుంటున్నాట్టే చదువుకుంటూ నాకు బోధపరిచి, అక్కడే గోనె పట్టామీద, పుస్తకాలు తలకింద పెట్టుకొని పడుకునేవాడు.

మొదట్లో కొన్నాళ్ళు పెటురుగడతో నేలమీద చప్పుడు చేస్తూ నన్ను లేపుతూ వుండేవాడు. ఓనాడు నేనెంతకీ లేవకపోతే నెత్తిమీద ఒక్కటి కొట్టి లేపి "సారీ వెంకట్రావూ, ముట్టేసుకున్నాను! వెళ్ళి స్నానం చేసిరా, నిద్దరా గిద్దరా తేలిపోద్ది" అన్నాడు.

"నా మొహం. నా కలాటి నమ్మకాల్లేవు. నేనెవర్ననుకున్నావు? మానూరు గాంధీగారి కొడుకుని!" అన్నాను.

0 0 0

కాఫీ తాగేసి, అల్లంత దూరాన గోలెంలో వున్న నీళ్ళు సిలవరి చెంబుతో నేను తెచ్చి పోస్తే గ్లాసు కడిగి మళ్ళా పెణకమీద పెట్టేడు నారాయణ. జేబు లోంచి రుమాలు తీసి చేతులు తుడుచుకుని, వసారాలో ఈ మూలకి వెళ్ళి ఇంత పేపూ నేను చూడని ఒక గోనెసంచి మోసుకొచ్చేడు. చేకుతాడు ముడులువిప్పి, అందులో పీకదాకా నిండిన సామాన్లు ఒకటొకటీ తీసి బెంచీమీద పేర్చడం మొదలెట్టేడు.

వాటన్నిటి వెనకా బోలెడు చరిత్ర వుంది.

హయ్యర్ సెకండరీ పరీక్షలో జిల్లాకి ఫస్టుగా పాసయ్యేడు నారాయణ. అంచేత కోనూరు మోతుబరి బుచ్చయ్యగారి పేరిట వున్న బందరు బంగారం మెడల్ వాడికొచ్చింది. దాంతో ప్రారంభమైంది ఆ చరిత్ర.

ఇంటర్- యూనివర్సిటీ మెడికల్ కాలేజి స్టూడెంట్స్ మీట్‌లో వాడు ఎలక్యూషన్‌కీ ఎస్సే రైటింగ్‌కీ, డిబేటింగుకీ తెచ్చుకున్న ఫస్టు ప్రయిజులు- మూడు మెమెంటోలు - ఆనాడే నాన్నగారికి ఇచ్చే బోయాడు. నలభై రూపాయిలు కర్చుపెట్టి నాన్నగారు వాళ్ళింట్లోనే ఒక అటక కట్టిస్తె ఇన్నాళ్ళూదాచేడు. అవి తెచ్చేడు ఇప్పుడు.

సెకండియర్‌లో వాణ్ని మెడికల్ కాలేజి స్టూడెంట్స్ కల్చరల్ అసోసియేషన్‌కి సెక్రటరీగా నిలబెట్టి గెలిపించేసరికి నా తాతలు దిగొచ్చేరు. అయితే నేమీ? ఆ ఏడాది వాడు జానపద సంగీతంలో ఒక గొప్ప ప్రయిజు, నాటికల పోటీలో గెల్చి ఒక బ్రహ్మాండమైన షీల్డు, సాంస్కృతిక కార్యక్రమాలు అవిచ్ఛిన్నంగా నిర్వహించినందుకు కాలేజి తరపున ఇచ్చిన స్పెషల్ మెమెంటో అటు నారాయణకే కాదు, ఇటు నాకూ, నాతోపాటు చదువులో వాడి నుంచి పోటీ అంటూ లేకుండా పైకొస్తున్న నా గ్రూపువాళ్ళకీ కూడా గర్వ కారణాలే. అవన్నీ ఆ బెంచీమీద, లేబిల్స్ తుడిచి అక్కడపెట్టేడు.

మూడో సంవత్సరం ఎనాటమీలో తప్పేడంటే అది నారాయణ తప్పుకాదు. ప్రొఫెసర్‌గారు మొదట్నించీ కలవ ఎల్లమ్మ అనే మాక్లాస్ అమ్మాయిని హెచ్చరిస్తూ వుండేవారు- నువ్వు రిజర్వేషన్‌మీద సీటు సంపాదించినా,

పేదరికంవల్ల స్కాలర్‌షిప్పులూ గ్రాంట్లూ సంపాదించినా, బాగా చదవకపోతే ఎనాటమీలో నిన్ను పాస్ చెయ్యడం నాకూ, నన్ను పుట్టించిన బ్రహ్మదేవుడికీ కూడా చాతకాదు- అంటాను. ఈ కలవ ఎల్లమ్మ అనే అమ్మాయి నారాయణ గ్రూప్‌లో జానపద సంగీతంపాడి బహుమతులు తెచ్చుకోడమే కాక రన్నింగ్ రేసెస్‌లోను, లాంగ్‌జంప్, హైజంప్‌ల్లోనూ, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో-ల్లోనూ ప్రెయిజులు పుచ్చుకుంది. రెండో ఏడాదిలో పుండగా ఎల్లమ్మేమిటి, నీ పేరు మార్చుకో; డాక్టర్ అవబోతున్నావు; డాక్టర్ ఎల్లమ్మ అంటే పేషెంట్లు రారు అని వాదించి, నారాయణ ఆమె పేరును వై. కలవ, అని మార్పించేడు. అందరూ "వై ? కలవ!" అని వేళాకోళం చేసేవారు. కలవ నల్లగా వున్నా కళగానే వుందిరోయి అని కొందరనేవారు. నల్లకలవ అపురూపమైన జాతిది సుమా- అనేవారు "జాతి" అనేమాట నొక్కిపలికి. అందులో ఒకడు "ఏమిట్రోయి. జాతి గీతి అంటున్నావు" అని కవ్వించేవాడు. "నే నన్నది అది కాదు గురూ, ఉండు, కొట్టకు! నల్లకలువ అని, అలెగ్జాండర్ డుమా రాసిన నవల చదివేవా? చదవకపోతే కల్చరల్ సెక్రటరీ గారి కేరాఫ్‌లో వుంది. 'గో-త్రు- ఇట్' అని ఆ కొంటెవాడు విపులీకరించేడు. ఎల్లమ్మ ఇవన్నీ అప్పుడొకటీ అప్పుడొకటీ ఏడుస్తూ చెప్పుకోడంలో, నారాయణకి అంతకి ముందుకంటా బాగా దగ్గరైంది. ఆ తర్వాత నిజం ఎంతో, అబద్ధం ఎంతో తెలియదుగాని, ఎనాటమీ ప్రొఫెసర్ గారు: "కలవని నన్నొచ్చి కలవమను. అంతా సెట్టింగైపోతుంది" అని నారాయణకి పురమాయించేడనీ, అలా అనడంలో అతనికేదో దురుద్దేశం వున్నట్టు కనబడుతోందని నారాయణ ప్రిన్సిపాల్‌గారికి చెప్పేడనీ, కథలు రాసి మెడికల్ కాలేజీ గోడలమీద ప్రచురించేరు. పర్యవసానంగా కలవతో బాటు నారాయణ కూడా తప్పేడు.

మూడో ఏడాది పరీక్ష తప్పగానే నారాయణకి స్కాలర్‌షిప్ రద్దయింది. మళ్ళీ ఆరు నెలల్లో అదే పరీక్ష రాసి అప్పుడు కూడా పాసవనందుకు సాంఘిక సంక్షేమ శాఖవాళ్ళు ఏర్పాటు చేసిన ఉచిత భోజన సౌకర్యం రద్దయింది. కాని సాంస్కృతిక రంగంలో అతను చేసిన కృషికి మెచ్చి "కొందరు సహాధ్యాయులు" అతనికొక "మెడికల్ డిక్షనరీ" (పుస్తకం గొప్పదే) బహుమతి ఇచ్చేరు. ఆ పుస్తకం కూడా ఈ సామగ్రిలో వుంది. దాంట్లో అట్ట తెరవగానే వచ్చే పేజీలో ఒక స్టిక్కర్ మీద స్కెచ్ పెన్‌తో అందంగా "మా అభిమాన సహాధ్యాయి ఆర్. నారాయణకి" అని వుంది.

నారాయణ ఆ పుస్తకం బెంచీమీద పెట్టకుండా నా చెంత [illegible] "దీన్ని జాగ్రత్తగా పరిశీలించి చూడు" అని వదిలేసి, చెప్పులు తొడుక్కున్నాడు.

ద్వారం దగ్గిర మీనాక్షి వున్నట్టు నేను చూడలేదు. ఆమె నోటిమీద అరిచేత్తో కొట్టుకుంటూ అవ్వ, అవ్వ, అవ్వ అని చప్పుడు చేసింది. నారాయణ నావేపు చూసి "ఇవన్నీ నీ సాయం లేకుండా నేను సంపాదించుకోలేనివే. నేనే తెలివైనవాడినని గర్వపడ్డాను. తెలివి ఒక్కడి సొమ్ము కాదని రుజువు చేసేవు" అని నిర్భావంగా చెప్పేసి వెళ్ళిపోయాడు.

"ఏంటదీ? అంత మరీ ముట్టుకునీ పట్టుకునీ ఇచ్చాడే: ఏం పుస్తకమదీ?" అంటూ మీనాక్షి దగ్గిరగా వచ్చింది. ఆ క్షణంలో మీనాక్షి నా దగ్గిరున్న చనువు ఆసరాగా ఆ పుస్తకం లాగేసుకుంటుందేమో అని భయపడ్డట్టుగా నేను వెనక్కి దాచాను. మోచేతికి బెంచీ అంచు తగిలి పుస్తకం కిందపడ్డంలో ఎలా పడిందంటేను- అట్ట తియ్యగానే వొచ్చిన మొదటి పేజీలో స్టిక్కర్ నేలకి రాపిడి పడి, సగం మేర లేచింది.

స్టిక్కర్ కిందకూడా ఏవో అక్షరాలున్నాయి.

స్టిక్కర్ పూర్తిగా వూడతీశాను.

అక్కడ——

"మానూరు గాంధీగారి ప్రియ పుత్రుడికి సహోధ్యాయుల కానుక" అని వుంది.

తెలుగులో వుంది.

మీనాక్షి నా మీదికి వొంగి ఆ రాత తనూ చదివేసి "ఐందా?" అంది.

నేను తెల్లమొహంవేసి "ఏమిటి అవడం?" అన్నాను.

ఒకవేలు ఆ రాతమీదికి చూపించి "నేనెప్పుడో చెప్పేను" అంది; మూతి వెక్కిరింపుగా తిప్పి "మీ కాళ్ళకింద గొయ్యే మీరు చూసుకోలేరు" అని విసురుగా లోపలికి వెళ్ళిపోయింది.

0 0 0

అదంతా వొట్టి నాన్‌సెన్సు. కిట్టనివాళ్ళు పుట్టించిన పుకారు. మానూరు గాంధీగారి ప్రతిష్ఠకి గాలి వూపు తలపెట్టిన ఎవరి తల్లోనో పుట్టిన నులిపురుగు.

నారాయణ కోనూరులో చదువుకి చేరకముందు వెంకడు మా కుటుంబం

నుంచి పొందినదేమీ లేదు. ఏడాదికి ఇన్ని అని లెక్క ప్రకారం కొల్చేగింజలు; పండుగా పబ్బం వొచ్చినప్పుడూ కష్టం సుఖం వొచ్చినప్పుడూ విదిల్చే మామూళ్ళు; అంతే. వాడు తొమ్మిదో క్లాసులోకి వచ్చినప్పుడు వెంకడు "చదువు కుంటూ పదిమందిలో మెసిలే కుర్రాడు; మరో రెండు జతలబట్టలూ రాసుకోడా నికి కలం, చదువుకోడానికి పుస్తకాలూ, మధ్యాన్నం ఆకలేస్తే ఏదైనా కొనుక్కు తినడానికి కొంచెం రోజువారీ చిల్లర డబ్బులు వుంటే, వాడు ఏడుపుగొట్టు మొహంతోనూ, తక్కువతనపు ఆలోచనతోనూ వుండ"డని దానికి తగినసాయం చెయ్యమని అడిగినప్పుడు నేనక్కడే వున్నాను. "చిన్నబాబుగారు విసుగుపుట్టి వొదిలేసిన బట్టలే" ఇమ్మన్నాడు. కాని నాన్నగారు కొత్తవే కుట్టించుకోమన్నారు. "లెక్కరాసుకోండి బాబయ్యా" అని వెంకడు అన్నాడుగాని "ఏడిశావ్ లే వెళ్ళు" అన్నారు నాన్నగారు— మెడికల్ కాలేజీలో చేరినప్పుడు పదిహేనువందలకి పైగా అయింది వాడి ఏర్పాట్లకి. "ఇప్పుడైనా లెక్క రాసుకోండి బాబయ్యా" అని వెంకడు అంటే "వాణ్ని రమ్మను నీకూ నాకూ మధ్య లెక్కలూ, పత్రాలూ ఇన్నాళ్ళు లేనివి ఇప్పుడెందుకు" అన్నారు. నారాయణకి సోషల్ వెల్ఫేర్ వాళ్ళ హాస్టల్లో వసతీ భోజనం ఆర్డర్లు వెంటనే ఇచ్చినా, స్కాలర్‌షిప్పు డబ్బు రాడా నికి ఎనిమిది నెలలు పట్టింది. అంతా వొక్కసారి అందుకున్నాడు. ఆ పన్నెండు వందలూ తెచ్చి ఇవ్వబోతే నాన్నగారు వెంకడి ఇంట్లో నారాయణ వుండడానికి వేరే ఒక గదిలాంటిది కట్టించమనీ, ఆ గదిలో టేబిలూ కుర్చీ పుస్తకాల అల మారా దీపం ఏర్పాటు చెయ్యమనీ చెప్పేసి, మరో ఎనిమిదివందలు తనే ఇచ్చేరు నన్ను చూడ్డానికెప్పుడైనా పట్నం వొస్తే నా చేతిలో నాలుగు వందలు పెట్టినా, నారాయణకి నూరు రూపాయలైనా ఇవ్వకుండా తిరిగి రాలేదు. ఎన్ని చేసినా ఎంత అయిపోయుంటుంది మహా! ఐదారు వేలు దాటదు. సెకండియర్ చివర్లో ఓసారి మీనాక్షి కూతురు 'పద్మ'కి జబ్బుచేస్తే పట్నం తీసుకొచ్చి పరీక్ష చేయించి నప్పుడు మెడికల్ వార్డులో కొచ్చి నారాయణ ఆవిడని పలకరించినప్పుడు బావు న్నావా, చదువు బాగా సాగుతోందా అలాంటి ప్రశ్నలు వేస్తే "నాకేమి లోటు పంతులమ్మగారూ, పెదబాబుగారు నన్ను కన్న కొడుకులా చూసుకుంటున్నారు" అని నారాయణ అంటే "కొడుకుని కొడుకులా చూసుకోకపోతే యింకెలా చూసు కుంటారు" అంది. అప్పుడు ఆవిడ అక్కడున్నది మూడు రోజులే అయినా మెడికోల మధ్య బాగా పాప్యులర్ అయిపోయింది. పిల్లకి వైద్యం సమంగా

అందుతోందో లేదో చూసే మిషతో ఒకడూ వొకడూ రావడం. ఆవిణ్ణి కబుర్లలో పెట్టడం, అవసరమైన దానికంటే ఎక్కువసేపు అక్కడుండిపోడం— రకరకాల అల్లరివాళ్ళు—నా క్లాస్‌మేట్లూ సీనియర్లూ, అనవసరపు ఆప్యాయత చూపించడం— ఇలా నాకు వాళ్ళమీద చిరాకు, అసూయ.

"నువ్వు వెనకబడిపోయినన్నాళ్ళు వాడు నీకు హితుడై మిత్రుడై దారి చూపించి తన ఔన్నత్యాన్ని చూపించేడు. వాడి అవసరాలు తీరడానికి మనం చేస్తున్న సాయానికి విలువకట్టే వాడు తీర్చుకోలేకపోడు. కాని ఆ అర్హత వాడు సంపాదించుకోడానికి నువ్వు చెయ్యి ఆసరా ఇవ్వాలి. గ్రహణ శక్తీ, ధారణా శక్తీ వున్నవాడే కదా. పైగా ఈ ఎనాటమీ కొండ దాటితే ఇంకే అడ్డూ వుండదని నువ్వే అంటున్నావు. వాణ్ణి దిద్దు చిన్నా" అని నాన్నగారు చాలా ఆవేదనతో చెప్పేరంటే అందులో మానూరు గాంధీగారికి ఇంకో రకమైన సానుభూతి ఆపాదించడం న్యాయంకాదు.

"వాడు కులంలోకెల్లా దీపంలా వెలగగలడన్న ధైర్యంతో వాళ్ళమ్మా, వెంకడూ అన్ని కష్టాల్నీ సహించి అన్ని దరిద్రాలనీ భరించి బతుకుతున్నారు. మన కుటుంబం వాళ్ళని సానుభూతితో చూస్తున్నా; మన కుటుంబంలో వాడే సాక్షాత్తు నా అన్నకి పుట్టిన కొడుకే వెంకడి కూతురు ఉరిపోసుకుని చావడానికి కారణం అయ్యాడంటే మనం మొదటి కంటె ఎక్కువగా వాళ్ళని ఆదుకోవాలి కదా. వాడు ఈ కోర్సు పూర్తిచేసి డాక్టరయ్యేడంటే ప్రభుత్వం వాడికి ఉద్యోగం ఇస్తుంది. ఆ తరవాత వాళ్ళు ఎక్కడెక్కడికో పోతారు తప్ప వాళ్ళ నించి మనకి పోటీ లేదు, వాళ్ళు మనకి సాటీ కాదు, దరిద్రుడూ నారాయణా కూడాను. ఆ దరిద్ర నారాయణ సహాయం నీ ద్వారా తుదముట్టితే అంతకన్న నువ్వు నాకు చెయ్యదగిన గౌరవం వేరే ఏం వుండదు. డబ్బుపెట్టి నేనిన్నాళ్ళూ వాణ్ని పైకి తీసుకొచ్చానే గాని, జ్ఞానం పంచిపెట్టి నువ్వు వాణ్ని ఈడేరిస్తే అదే గొప్ప సహాయం చిన్నా." అన్నారు నాన్నగారు.

వాడు ఎనాటమీ పరీక్ష తప్పిన నుంచి నేను హవుస్సర్జెనీ పూర్తిచేసేదాకా గడిచిన ఈ మూడేళ్ళలోను నాన్నగారు వాణ్ణి గురించి నాతో సూటిగా మాట్లాడ్డం ఈ నాలుగు రోజులనుంచే. ఏ ఒక్కసారీ ఒక్క వాక్యం కంటే ఎక్కువ మాట్లాడలేదు. దేనికీ నా నుంచి మాటల రూపంలో సమాధానం ఆశించలేదు. మాటల్లో ఏమీ లేదనీ, చేతల్లోనే అంతా వుందనీ నమ్మడం—ఆయనకీ, నాకూ వున్న ఒకే ఒక బలమైన పోలిక.

ఒకటి మాత్రం నిజం. చిన్నక్లాసుల్లో మా ఇద్దరి 'కంబైండు స్టడీ'గురించి

నారాయణ సమాచార ప్రాయంగా తప్ప ప్రగల్భంగా చెప్పుకోకపోయినా "నువ్వింతవాడివి కావడానికి తనే కారణం అవి గొప్పలు చెప్పుకుంటూ విన్ను తీసిపారేస్తున్నాడ్రా, ఒరే!" అంటూ నా మెడికో మిత్రులు చెప్పిన మాటలకి నేను పరోక్షంగా ప్రతిస్పందించేను గాని ప్రత్యక్షంగా కానే కాదు. అది కూడా గాంధీ మార్గమే అని నా నమ్మకం. కాలం గడుస్తున్నకొద్దీ గాంధీగారి అహింసా వాదానికీ, సత్యాగ్రహానికీ కొత్తకొత్త రూపురేఖలు వస్తూనే వున్నాయి కదా.... విశ్వాసాలు సమానమే అయినా ఆచరణ మార్గాలు వేరుకావచ్చునన్నది కాలం తెచ్చే మార్పు.

పంచాయితీ బోర్డు ఆఫీసులో పనుల ఒత్తిడివల్లా హరిజనవాడలో జరిగిన అగ్నిప్రమాదంవల్లా నాన్నగారికీ నాకూ రెండు రోజులపాటు సంభాషణకివేదిక, తీరిక దొరకలేదు. మూడో రోజున ఆయన కోనూరులోనూ, హంసవాడలోనూ అధికారులని కలుసుకోవాలని ఉదయమే లేచి వెళ్ళిపోయేరు; రాత్రికి రానేలేదు,

ఈ సమయం అంతా మీనాక్షి నన్ను సతాయిస్తూనే వుంది. "గాంధీగారు ఎంత మొండివారో నాన్నగారు అంతకంతా మొండివారు చినబాబూ. మీరు మంచి అనుకున్నా అనుకోకపోయినా అన్నీ తెలిసినవారూ. ఎవర్నీ లక్ష్యపెట్టని వారూ అయిన పెదబాబుగారు ఏం చెప్తే అది చెయ్యడం మీకు విధాయకం. చేతులు కాలేక ఆకులు పట్టుకోడంవల్ల లాభంలేదు. ఏమైతే అదే అవుతుంది; పెదబాబు గారు చెప్పినట్టు చేస్తానని మాటిచ్చెయ్యండి. ఆనక ఆయన పట్టుదలవల్ల మీ ధైర్యం వీగిపోతేఅంతకన్నాచెడ్డ ఏదీ వుండదు."ఆత్మీయురాల్లా సలహాఇచ్చింది.

0 0 0

నాలుగోరోజు నాన్నగారు పట్నంనుంచి వచ్చేసరికి ఉదయం పదిగంటలు దాటింది. ఎక్కడ తగిలేడో తెలీదుగాని నారాయణ ఆయనతోడా వచ్చాడు. వాణ్ణి వీధి వసారాలో వదిలేసి లోపలికొచ్చారు నాన్నగారు, స్నానంచేసి బట్టలు మార్చుకుని "భోంచేద్దాం రారా చిన్నా" అన్నారు. నాకు వేళ అవకపోయినా మెత్తబడి వెంటపడ్డాను.

"నువ్వు ఎం.ఎస్. చెయ్యడానికి ఆర్డర్ వచ్చిందిరా చిన్నా" అన్నారు నాన్నగారు.

"చెప్పరేం? థాంక్స్ నాన్నగారూ.... మరి-"

"అదీ అయింది. డాక్టర్ సింహాచలం గార్ని అడిగావుటగా; ఆయన నర్సింగ్ హోమ్‌లో పని చేస్తానని? ఆయన నిన్ను రేపే వచ్చేమన్నారు..."

"మరీ రేపు కాకపోయినా ఫస్ట్ తారీక్కల్లా వెళ్ళి చేరుతాను నాన్నగారూ."

"అలా కుదరదనుకుంటాను చిన్నా. ఎల్లుండి వుదయం నువ్వు ప్రొఫెసర్

గారి దగ్గిర రిపోర్ట్ అవాలిట. సింహాచలంగారు నువ్వుండడం కోసం వాళ్ళ పాత ఇంట్లో నాలుగు గదులు ఖాళీ చేసి ఇస్తానన్నారు. ఔట్ హౌస్‌లో మీనాక్షమ్మా పద్మా వుండొచ్చు; నీకు సాయంగా. నారాయణ సింహాచలం గారి నర్సింగ్ హోమ్‌లో పనిచేస్తూ చదువుకుంటాడు."

"ఏం పని చేస్తాడట?" అన్నాను; వ్యంగ్యం కనపడనీయకుండా.

"ఎంత పుచ్చిన మిరియాలైనా ధనియాల పాటి చెయ్యవా అని సామెత. కాంపౌండర్‌గా పని చెయ్యగలడు కదా."

"నేను హాస్టల్లోనో, అక్కడ రూమ్ దొరక్కపోతే హోటల్ రూమ్‌లోనో వుంటాను. నాకు వొండి పెట్టడానికి కన్నా మీకు వేళకన్నీ సదునుగా అమర్చి పెట్టడానికే మీనాక్షి ఎక్కువ అవసరం—" అని చెపుదామని సిద్ధం అవుతూ వుండగానే నాన్నగారు లేచిపోయారు. "సావిట్లో వుంటాను రా!" అని చెప్పి వెళ్ళిపోయారు.

0 0 0

"అవసరం అయిందానికి మించి చనువూ, నవ్వూ కూడదు" అన్నాను; నిస్సంగత్వ ధోరణిలో.

"నాకా మాత్రం తెలీదూ? పిల్లకి పదోయేడు వెళుతోంది—" అంది నవ్వుతూ.

"ఛీ!" అని చెయ్యి కడుక్కుని లేచాను. సావిట్లోకి వెళ్ళేసరికి నాన్నగారు మళ్ళీ ఏదో ప్రయాణానికి లాగ బట్టలు సర్దుతున్నారు. ఇందాక పట్నం నించి తెచ్చిన ఫైబర్ గ్లాస్ సూట్‌కేసులో కాకుండా చెవులు అమర్చిన యూరియా సంచిలో సర్దుతున్నారు.

"చదువులో శ్రద్ధగానే వుండాలనుకో, కాని, నెలకో మారైనా వచ్చి ఇల్లూ పొలమూ చూసి వెళ్తూవుండు చిన్నా" అన్నారు నాన్నగారు.

"అంటే?"

"మూడుతరాల కాలంనుంచీ ఈ ఇంటికి తాళంపెట్టి వెళ్ళడమంటూ లేదు"

"అంటే? సమంగా చెప్పండి నాన్నగారూ, నాకేమిటో గాభరాగా వుంది!" అన్నాను.

నాన్నగారు సంచి సర్దడం పూర్తిచేసి, "నేను రెండేళ్ళపాటు సేవాగ్రాంలో వుందామని వెళ్తున్నాను చిన్నా. అబ్బే; ఏం లేదు, మార్పుకోసమంతే. గాంధీగారి ప్రవచనాలు ఎవరో తెలుగులో రాసేరట. అవన్నీ చూసి, పదిమందిలో చదవడానికి వీలుగా తిరగరాయించాలట. మరో ముగ్గురితో పాటుగా నాకూ పిలుపొచ్చింది. ఏర్పాట్లన్నీ చేసేశాను. ఈ రాత్రే కోణార్క్ పట్టుకోవాలి."

దెబ్బ కరెంటు షాకులాగ హెచ్చరిక లేకుండా తగిలింది. "ఏంటి నాన్నగారూ నేను తప్పు చేసేనే అనుకోండి. నన్ను దండించాలేగానీ నా దగ్గిరకూడా సత్యాగ్రహమేనా?"

నాన్నగారు ప్రశాంతత వదల్లేదు. "ఆగ్రహం లేదు చిన్నా. అంచేత సత్యాగ్రహం కూడా లేదు. రెండేళ్ళు ఎంతలో గడిచిపోతాయి! పొలం మీద రాబడి అంతా కోనూరు బ్యాంకిలో నీ కాతాలో జమ చెయ్యాలని వెంకడికి నియమం పెట్టేను. మన పూర్వుల ప్రమేయం లేకుండా నేను పోస్టుమాస్టర్‌గా, పంచాయితీ గుమాస్తాగా ఉద్యోగం చేసి సంపాదించుకున్నది తుమ్మల చెరువు కింద పల్లం అయిదెకరాల ముప్పయి సెంట్లు నారాయణ పేర రాసి రిజిష్టర్ చేసేను. దానిమీద రాబడితో వాడు చదువుకుంటాడో ఆ పొలమే వాడు చేసుకుంటాడో వాడి ఇష్టం. మీనాక్షి మొగుడు పోయి కూతురితోసహా దిక్కులేక మనింటిలో చేరినందుకు దాన్ని నువ్వు ఎన్నాళ్ళు బాగా చూసుకుంటావో నాకు తెలియదు కదా. ఎంత చెడ్డా బ్రాహ్మనామె. అంచేత నలభై వేలు ఒక ఫిక్సెడ్ డిపాజిట్ చేసి దానిమీద వడ్డీ మాత్రం మీనాక్షికి ఏడాదికోమాటు అందజెయ్యమని నిబంధన పెట్టేను. ఇహ, నీ కంటావా! తరతరాల ఆస్తీ పొలమూ కొంపా సరుకూ సబ్బరా అన్నీ నీవేకదా.... వుండు, నీకు ఆ కాయితాలన్నీ తెచ్చిస్తాను. అన్నీ రిజిష్టర్ చేసినవే.తగూలూ తంటాలూ వుండవు"అనిలోపలికి వెళ్ళబోయేరు.

ముందుకి వెళ్ళి రెండు కాళ్ళూ పట్టేసుకొని కూర్చున్నాను. నాన్నగారు నా తలమీద చెయ్యి ఆనించి పడిపోకుండా కాసుకున్నారు.

తల ఎత్తి చూసేను.నాన్నగారు అంతఎత్తరి మనిషని ఇన్నాళ్ళుఎరగను.

"రెండు మాటలు వినండి నాన్నగారూ" అన్నాను. "సరే చెప్పు" అని ఆయన అనరు. నేను ఆ వ్యవధి ఇవ్వలేదు. "మీరన్నవి అన్నీ రైటే. అదలా వుంచి ఈ పూర్వార్జితమైన ఆస్తులు లేకుండా కూడా నేను బతగ్గల్ను. అది రైటే కాని- కాయితాలు రాయడం, రిజిష్టర్ చెయ్యడం, అదంతా అల్లరి. ఈ రకం శాంతి స్థాపన గాంధీ మార్గం కాదేమో అని నా మనవి. మీరు ఏం చెప్తే అది చేస్తాను. మీరు వెళ్ళిపోకండి. ఈ శాంతి అమలు అవుతుందో లేదో అని అక్కడెక్కడో మీరు వేదనగా వుండడం మీక్కాదు నాకే శిక్ష."

నాన్నగారు చిరునవ్వుతో నన్ను లేవతీసేరు" ఎంత చిన్న తప్పు అయినా శిక్ష తప్పించుకో కూడదని గాంధీగారు అన్నారు. నేను వెళ్ళడం నా తప్పుకి నా శిక్ష. నెల రోజులు గడిపి, నువ్వు ఇదే స్థిరత్వంలో ఉత్తరం రాయి. రాకపోతే అప్పుడు అడుగు" అని, నన్ను విడతీసి. గదిలోకెళ్ళి ఒక కవరు తెచ్చి ఇచ్చి, చెవులు అమర్చిన యూరియా సంచితో సావిడి దాటేరు.

ఆయన వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళేరు,

ఆయన, మామూరు గాంధీగారు!

నా తండ్రిగారు.